కడియం రైతుల ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు నీరు పోస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్

వెయ్యి మొక్కలు నాటిన 'కడియం' రైతులు

కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని వేడుక • హాజరైన రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజును (ఫిబ్రవరి 17) పురస్కరించుకొని రాజహేంద్రవరంలోని కడియం నర్సరీ రైతులు వెయ్యి మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ పిలుపు మేరకు వృక్షార్చనలో భాగంగా బుధవారం నిర్వహించిన ఈ వేడుకకు గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులతో కలిసి ఉత్సాహంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు బంధువు, హరిత ప్రేమికుడు కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని కడియం నర్సరీ రైతు పాలూరి నాని ఆధ్వర్యంలో 1000 మొక్కలు నాటడం గొప్ప విషయమని ప్రశంసించారు. కేసీఆర్‌పై రైతులు చూపించిన ప్రేమ అభినందనీయమని పేర్కొన్నారు. ప్రాంతాలుగా విడిపోయినా, ప్రజలుగా కలిసిమెలిసి ఉందామని ఉద్యమ సమయం నుంచే కేసీఆర్ చెప్పేవారని, ఇక్కడి వాతావరణం చూస్తుంటే కేసీఆర్ నాడు చెప్పిన మాటలు గుర్తుకువస్తున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో హరితహారం ద్వారా పదేండ్లలో 280 కోట్ల మొక్కలను నాటామని, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 8.3 శాతం పచ్చదనం పెరిగిందని గుర్తుచేశారు. కడియం రైతు మాధవ్ మాట్లాడుతూ.. రైతుబంధువు కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని మొక్కలు నాటడం ఆనందంగా ఉన్నదని చెప్పారు. హరితహారం వల్ల తమకు ఉపాధి లభించిందని, కడియం నర్సరీల నుంచి తెలంగాణ ప్రభుత్వం మొక్కలను కొనుగోలు చేయడంతో తమ వ్యాపారం ఎంతో వృద్ధి చెందిందని గుర్తుచేశారు. అనంతరం కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేండ్లు జీవించాలని, మళ్లీ తెలంగాణకు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతులు బాలాజీ, ఈల సత్యనారాయణ, శ్రీనివాసరావు, నిమ్మలపూడి త్రిమూర్తులు, హరిత సేవ నాయకులు రాఘవ, కిశోర్‌గౌడ్, పూర్ణచందర్, పాండాల జగన్మోహన్, మురళీకృష్ణ, సతీశ్, ఎన్ఎన్ రాజు, భోజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం క్యూలో చెప్పులు

యూరియా కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్నంపల్లి సింగిల్ విండో ఎదుట రైతులు యూరియా కోసం ఉదయాన్నే తరలివచ్చి క్యూలో ఇలా చెప్పులు రాళ్లు, డబ్బాలు పెట్టి నిరీక్షించారు. – సైదాపూర్

మరో రైతు ఆత్మహత్య

- సాగు కలిసిరాక మనస్తాపం
- మహబూబాబాద్ జిల్లాలో అప్పులభారంతో బలవన్మరణం

ఇప్పటికి రాలిన మట్టిపూలు 425

గజ్జి రమేశ్ (ఫైల్)

డోర్నకల్, ఫిబ్రవరి 12: సాగు కలిసి రాక.. అప్పుల భారం మోయలేక మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చిలుక్కోయల పాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. చిలుక్కోయలపాడుకు చెందిన రైతు, మన్నెగూడెం పీఏసీఎస్ డైరెక్టర్ గజ్జి రమేశ్ (45) వ్యవసాయ పెట్టుబడి కోసం రూ. 20 లక్షలు అప్పు చేశాడు. తనకున్న రెండెకరాల భూమితోపాటు, మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి తోట, వరి పొలం సాగుచేశాడు. నిరుడు వ్యక్తిగత అవసరాల కోసం ఎకరం భూమి అమ్ముకున్నాడు. ఈ క్రమంలో అప్పుల బాధ తట్టుకోలేక ఈ నెల 5న వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగాడు. ఖమ్మంలోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ చనిపోయాడు.

మనోవేదనతో ట్రిపుల్ ఆర్ బాధిత రైతు మృతి

- యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో విషాదం

వెంకట్‌రెడ్డి (ఫైల్)

చౌటుప్పల్, ఫిబ్రవరి 12 : రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూమి కోల్పోతున్న రైతు మనోవేదనతో అనారోగ్యానికి గురై మృతి చెందాడు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణానికి చెందిన రైతు చింతల వెంకట్‌రెడ్డి (70)కి స్థానికంగా 30 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. ట్రిపుల్ ఆర్ నిర్మాణం కోసం తీసిన అలైన్‌మెంట్‌లో ఆయన భూమి మొత్తం పోతున్నది. నెలరోజుల కిందట రెవెన్యూ అధికారులు సర్వేకు రాగా, అప్పటినుంచి తీవ్ర మనోవేదన చెందుతూ అనారోగ్యం బారిన పడ్డాడు. దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మరణించాడు.

శివన్నగూడెం ప్రాజెక్టు వద్ద పనులను అడ్డుకొని ఆందోళన తెలుపుతున్న బాధితులు

పోలీసులతో భయపెట్టి భూసేకరణా?

మర్రిగూడ, ఫిబ్రవరి 12 : పోలీసులతో భయపెట్టించి భూసేకరణ జరుపుతారా? అంటూ రైతులు, ప్రజలు అధికారులపై మండిపడ్డారు. ప్లాట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ ప్రాజెక్టు పనులను అడ్డుకుంటే అధికారులు, ప్రాజెక్టు యజమానులు ఒక్కటై పోలీసులతో భయపెట్టిస్తున్నారని నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం ప్రాజెక్టు కట్ట వద్ద బుధవారం భూనిర్వాసితులు టిప్పర్లను అడ్డుకొని పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్లు ఖాళీ చేయాలని అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాన్ని ఖాళీ చేయాలని కలెక్టర్ నుంచి అధికారికంగా తమకు ఎలాంటి నోటీసులు అందలేదని తెలిపారు. అలాంటప్పుడు గ్రామాన్ని ఎం దుకు ఖాళీ చెయ్యమంటున్నారని ప్రశ్నించారు. ప్లాట్లు, నష్టపరిహారం అందకుండా ఇండ్లను ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లి బతకాలని నిలదీశారు. గ్రామస్థులను ప్రలోభాలకు గురిచేస్తూ తమ మధ్య గొడవలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

గొర్రెలతో వినూత్న నిరసన

డంపింగ్ యార్డు మాకొద్దంటూ గుమ్మడిదలలో గొల్లకుర్మల ఆందోళన

డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా గుమ్మడిదలలో జాతీయ రహదారిపై గొర్రెలతో వినూత్నంగా నిరసన చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 12: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. బుధవారం బర్రెలు, ఆవులతో గుమ్మడిదలలో ప్రధాన రహదారిపై వినూత్నంగా నిరసన చేపట్టారు. రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గొల్లకుర్మలు గొర్రెలు, మేకలను తోలుకుని వచ్చి జాతీయ రహదారి-765డీపై వినూత్నంగా నిరసన తెలిపారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా వారంరోజులుగా ఆందోళనలు, నిరసనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని బాధిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. గుమ్మడిదల, కొత్తపల్లి, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 8వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు మద్దతుగా బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు, నరేందర్‌రెడ్డి తదితర నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు నిర్మాణంతో తమ బతుకులు దెబ్బతింటాయని, పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే డంపింగ్ యార్డు నిర్మాణ పనులు నిలిపి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డు పనులు తాత్కాలికంగా నిలిపివేసినట్టు తహసీల్దార్ గంగాభవాని తెలిపారు. కొంతమంది రైతులు ప్యారానగర్‌లోని తమ భూముల్లో డంపింగ్‌యార్డు పనులు కొనసాగుతున్నాయని హైకోర్టును ఆశ్రయించడంతో ఈనెల 13 నుంచి 19 వరకు సర్వే చేయనున్నట్టు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు తాత్కాలికంగా పనులు నిలిపివేసినట్టు తెలిపారు. కాగా గుమ్మడిదలలో కొనసాగుతున్న రిలే దీక్షా శిబిరాన్ని తహసీల్దార్ సందర్శించి డంపింగ్ యార్డుపై అవగాహన కల్పించడానికి ప్రయత్నించగా ఆందోళనకారులు అడ్డుకున్నారు. ప్రభుత్వం యార్డు అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని వారు తేల్చిచెప్పారు.

ప్యారానగర్ వ్యర్థ నిర్వహణ కేంద్రం పనులకు బ్రేక్

పనులు వెంటనే నిలిపేయాలని మధ్యంతర ఉత్వర్వులు జారీ

25కు విచారణ వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో 152 ఎకరాల్లో వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించాలన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాదాపూర్‌కు చెందిన ఏ స్వర్ణలత దాఖలు చేసిన వ్యాజ్యాన్ని బుధవారం న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ విచారించారు. పిటిషనర్ న్యాయవాది కైలాశ్ నాథ్ పీఎస్ఎస్ వాదించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు, ప్యారానగర్‌లో వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం నిర్మాణ పనులు నిలిపివేయాలని రాష్ట్రానికి మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది. రోడ్డునిర్మాణం, సర్వే యథావిధిగా కొనసాగించేందుకు అనుమతిచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 25కు వాయిదా వేసింది.

రైతులపై మంత్రి కోమటిరెడ్డి జులుం!

- మిమ్మల్ని ఇక్కడికి ఎవడు రమ్మన్నడు?
- మీ ఎమ్మెల్యేను తీసుకొని రమ్మన్న మంత్రి
- అవమానభారంతో వెనుదిరిగిన మల్లేపల్లి భూనిర్వాసితులు

మంత్రి కోమటిరెడ్డి అవమానించాడంటూ మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేస్తున్న రైతులు

వలిగొండ, ఫిబ్రవరి 12 : జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాల్సిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించాడని, నోరుపారేసుకుని అవమానించాడని బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌరెల్లి నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం, వర్కట్‌పల్లి, పొద్దటూరు, ఏదుళ్లగూడెం, రెడ్లరేపాక, దాసిరెడ్డిగూడెం, మల్లేపల్లి, లోతుకుంట గ్రామాల రైతులు భూములను కోల్పోతున్నారు. రోడ్డు నిర్మాణం కోసం ఆయా భూముల్లో అధికారులు మార్కింగ్ చేశారు. కోట్ల విలువైన భూములను కోల్పోతున్న మల్లేపల్లి రైతులు తమకు న్యాయం చేయాలని బుధవారం హైదరాబాద్‌లోని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. మంత్రి వారి గోడు వినకుండానే అడ్డగోలుగా మాట్లాడినట్టు రైతులు వాపోతున్నారు. 'ఎందుకొచ్చింద్రు. ఎవడు రమ్మన్నడు మిమ్మల్ని. మీ ఎమ్మెల్యేను తీసుకొని రాపోండ్రి' అంటూ గదమాయించాడని భువనగిరిలో వారు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. చేసేదేమీ లేక వినతి పత్రాన్ని మంత్రి పీఏకు అందజేసి వెనుదిరిగినట్టు వారు తెలిపారు.

చేతకాకపోతే రాజీనామా చేయండి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12: అభివృద్ధి పనులు చేపట్టడం చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ నుంచి జూకల్, చందాపూర్, సత్యగామ, అనంతసాగర్, బంద్రాన్‌పల్లి వరకు రోడ్డు అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం రూ.1.48 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది గడిచినా రోడ్డు పనులు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు.

క్షమాపణలు చెప్పాలి: సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలోని తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని అవమానించినందుకు ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ చేనేత ఎక్స్‌పో కోసం అమరుల స్థూపానికి ఫ్లడ్ లైట్లు కట్టి సిబ్బంది అమరవీరుల స్థూపాన్ని అవమానించడం గర్హనీయమని పేర్కొన్నారు.

మూడెకరాల రైతులకు 'రైతుభరోసా'

- మొత్తం ఇప్పటివరకు 44.82 లక్షల మందికి నగదు జమ
- రైతుల ఖాతాలకు 3,487 కోట్లు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ): మూడెకరాల వరకున్న రైతులకు బుధవారం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని జమ చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9.56 లక్షల మంది రైతులకు 20.51 లక్షల ఎకరాలకు రూ.1,230.98 కోట్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు రూ.3,487.82 కోట్లను 58.13 లక్షల ఎకరాలకు గాను మొత్తంగా 44.82 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. ఈ పెట్టుబడి సాయాన్ని రైతులు తమ వ్యవసాయ అవసరాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. మిగతా వారికీ త్వరలోనే జమ చేస్తామని పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీ.. ఇచ్చిన మాట నిలుపుకో!

18 ఏండ్లు నిండిన మహిళలకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను నిలుపుకోవాలని బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షుడు కొమ్ము నరేశ్ ఆధ్వర్యంలో మహిళలు పోస్ట్‌కార్డులు రాసి నిరసన తెలిపారు. – జమ్మికుంట

అమనగల్‌లో బీఆర్ఎస్ సభకు అనుమతి

- శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా అమనగల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనున్న సభకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అమనగల్ జూనియర్ కాలేజీ మైదానంలో ఈనెల 18న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 3 వేల మందితో సభ నిర్వహించుకునేందుకు అనుమతి మంజూరు చేసింది. నేర చరిత్ర ఉన్నవారిని సభకు అనుమతించొద్దని, రెచ్చగొట్టే ప్రసంగాలు, మత, రాజకీయపరమైన ప్రకనటనలు చేయరాదని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు షరతులు విధించింది. ఒకవేళ అవాంఛనీయ ఘటనలేమైనా జరిగితే బాధ్యుల వివరాలను పోలీసులకు అందజేయాలని స్పష్టం చేసింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

'భరోసా'పై ఏవోను నిలదీసిన రైతు

కొల్లాపూర్, ఫిబ్రవరి 12 : ఎకరంలోపు ఉన్న రైతుల్లో చాలామందికి రైతు భరోసా డబ్బులు జమ కాలేదని రైతులే చెప్తున్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం చింతపల్లికి చెందిన ఓ రైతు మండల వ్యవసాయ అధికారి కార్యాలయానికి వచ్చి అధికారులను నిలదీశాడు. 'రైతు భరోసా సాయం అందలేదు. మీరే ఆ పైసలు వేస్తలేరు' అని అధికారితో వాగ్వాదానికి దిగాడు. దీనికి పెట్టుబడి సా య ం డబ్బులు కొందరికి ఎందుకు పడలేదో తనకే అర్థం కావడం లేదని సదరు అధికారి సర్దిచెప్పాడు. రైతులకు సమాధానం చెప్పలేకపోతున్నామని పలువురు ఏవోలు పేర్కొంటున్నారు.

లోన్ కట్టలేదని ఇంటి గేటు జప్తు

డీసీసీబీ అధికారుల నిర్వాకం

కొడకండ్ల, ఫిబ్రవరి 12: గేదెల కోసం లోన్ తీసుకొని కట్టడం లేదని బ్యాంకు అధికారులు రుణగ్రస్థురాలి ఇంటి గేటును తీసుకెళ్లిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మద్దెబోయిన ప్రేమలత ఐదుగురు గ్రూపు సభ్యులతో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ డీసీసీ బ్యాంకులో 2021లో రూ. 6 లక్షల లోన్ తీసుకున్నారు. రూ.3 లక్షల మేర చెల్లించి, మిగతా నగదు కట్టకపోవడంతో బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ బ్యాంకు అధికారులతోపాటు మండల కేంద్రానికి చెందిన డీసీసీబీ అధికారులు ఏడునూతుల గ్రామానికి వచ్చి రుణం కట్టని ఇండ్లకు వెళ్లి అడిగారు. నోటీసులు పంపినా లోన్ కట్టకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గేటును బాధితురాలి భర్తతోనే ఊడబీకించి ట్రాక్టర్‌లో వేయించారు. ఐదుగురు సభ్యులు బ్యాంకు వారికి కట్టాల్సిన నగదు మొత్తం మాట్లాడి సెటిల్ చేసుకోవడంతో ప్రేమలతకు చెందిన గేటు అక్కడే వదిలి వెళ్లారు. మరో గ్రూపులో వారు కూడా డబ్బులు కట్టకపోవడంతో మద్దెబోయిన కళమ్మకు చెందిన గేటును తీసుకువెళ్లారు.

పన్ను చెల్లించని వారి ఆస్తులు జప్తు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 12 : నిర్మల్ పట్టణంలోని పలు వార్డుల్లో ఏండ్ల తరబడి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. బుధవారం ఆదర్శనగర్ కాలనీకి చెందిన ఓ ఇంటి యజమాని ఆరేండ్ల నుంచి రూ.68 వేల పన్ను చెల్లించకపోవడంతో అతని ఆస్తులను జప్తు చేశారు. అతనితోపాటు ఎన్టీఆర్ మార్గ్, రాంనగర్ కాలనీ, ఇందిరమ్మ కాంప్లెక్స్‌లోని ఫర్టిలైజర్ దుకాణాన్ని సీజ్ చేశారు. పన్నులు చెల్లించని వారి ఆస్తులను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జప్తు చేశారు.

ఖమ్మంలో మిర్చి రైతుల ఆందోళన

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం క్వింటా మిర్చికి రూ.1,000 చొప్పున బోనస్ ఇవ్వాలని, మిర్చి క్వింటాకు రూ.35 వేలు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులతోపాటు అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చల రంగయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెచ్చల రంగయ్య, ఉప్పల ప్రభాకర్ మాట్లాడారు. – రఘునాథపాలెం

కాళేశ్వరంలో రోడ్డుకు భూములియ్యం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో నేషనల్ హైవే బైపాస్ రోడ్డు నిర్మాణానికి తమ భూములను లాక్కోవద్దని పలువురు రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఉన్న కొద్దిపాటి భూమిని లాక్కుంటే తాము నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. – మహదేవపూర్(కాళేశ్వరం)

ఉదండాపూర్ కట్టపై రైతుల ధర్నా

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉదండాపూర్ గ్రామ సమీపంలో పాలమూరు ప్రాజెక్టు నిర్మాణంలో ఇండ్లు, భూములు కోల్పోయిన భూనిర్వాసితులు బుధవారం ఉదండాపూర్ రిజర్వాయర్ కట్టపై ధర్నా నిర్వహించారు. పునరావాసం కల్పించలేదని.. పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. – జడ్చర్ల